సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం । 28 । అక్టోబర్ । 2023



బాధలు తీర్చాలి

కాలంతో పోటీపడి పనిచేసినా గుర్తింపు రావడం లేదని సాక్షి 'పీపుల్స్ ఎజెండా'లో ఆర్టీసీ కార్మికులు వాపోయారు. - 10లో



పేదల సంక్షేమమే లక్ష్యం

పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. - 11లో



అధికారంలోకి రావడం ఖాయం

కాంగ్రెస్ అధికారంలో రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 11లో

న్యూస్‌రీల్

నేడు ఆంధోళ్ మైసమ్మ ఆలయం మూసివేత

చౌటుప్పల్ : చంద్రగ్రహణం సందర్భంగా చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురం శ్రీఆంథోళ్ మైసమ్మ ఆలయాన్ని శనివారం మూసివేయనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఆలయాన్ని మూసివేయనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి మోహన్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఆదివారం ఉదయం 8 గంటలకు ఆలయాన్ని తెరవనున్నట్లు పేర్కొన్నారు. సంప్రోక్షణ చేసి యథావిధిగా భక్తులకు స్వామివారికి దర్శనానికి అనుమతిస్తామన్నారు.

యాదాద్రిలో శరత్ పూర్ణిమ వేడుకలు



బ్రహ్మోత్సవ మండపంలో శ్రీస్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం శరత్ పూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీస్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ వీధిలో ఊరేగించారు. అనంతరం బ్రహ్మోత్సవ మండపంలో సేవను అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అర్చకుల వేద మంత్రోశ్చరణల మధ్య పాలలో వెన్నెల చంద్రదర్శనోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలో అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయాధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. కాగా శనివారం రాత్రి చంద్ర గ్రహణం కారణంగా ఒక రోజు ముందుగానే శరత్ పూర్ణిమ వేడుకలు నిర్వహించారు.

కనుల పండువగా ఊంజలి సేవ

యాదాద్రిలో ఊంజలి సేవ కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారిని అలంకరించి ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అధిష్టించి ఊంజలి సేవ చేపట్టారు. ఆండాళ్ అమ్మవారికి ఇష్టమైన నాధ స్వరాన్ని వినిపించారు. అనంతరం హారతినిచ్చారు. ప్రధానాలయంలో విశేష పూజలు కొనసాగాయి.

కేసీఆరే హ్యాట్రిక్ సీఎం



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : స్వార్థ ప్రయోజనాల కోసం ఎంతమంది బీఆర్‌ఎస్‌ను వీడినా కేసీఆర్ మూడవ సారి సీఎం కావడం ఖాయమని ఆపార్టీ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం భువనగిరిలోని ఆయన విలేకరులతో మాట్లాడారు. హైప్ క్రియేట్ చేయడంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని మించిన వారు లేరని, ఆయన నీటి బుడగలాంటి వారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తుందన్న మాట ఉత్తదేనన్నారు. కాంగ్రెస్‌లో పైసల మాయ నడుస్తుందని, డబ్బులు ఇస్తే పార్టీకి సంబంధం లేని వ్యక్తులకు కూడా టికెట్ ఇస్తున్నారని ఆరోపించారు. సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను మళ్లీ గెలిపిస్తాయన్నారు. భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ప్రజల మనిషి అని, ఆయన విజయం కోసం కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేయాలని కోరారు. ఆలేరులోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునితామహేందర్‌రెడ్డి విజయం ఖాయమన్నారు.

3 ఖరారు.. సస్పెన్స్

కాంగ్రెస్ రెండో జాబితాలో మూడు స్థానాలకు అభ్యర్థుల ప్రకటన

మరో మూడు స్థానాల్లో కొనసాగుతున్న ఉత్కంఠ

- మునుగోడు సీటు మళ్లీ రాజగోపాల్‌రెడ్డికే..
- భువనగిరి నుంచి అనిల్‌కుమార్‌రెడ్డి
- దేవరకొండ టికెట్ బాలూనాయక్‌కు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సీపీఐకి స్థానం ఇవ్వనట్టే..!



కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

నేనావత్ బాలునాయక్

కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: తర్జనభర్జనల అనంతరం కాంగ్రెస్ పార్టీ రెండో జాబితాను శుక్రవారం ప్రకటించింది. అందులో ఉమ్మడి జిల్లాలో మూడు స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసింది. మునుగోడు నియోజకవర్గంలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, భువనగిరి అభ్యర్థిగా కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, దేవరకొండకు నేనావత్ బాలునాయక్ పేర్లను ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలకు గాను ఇప్పటికే ఆరు నియోజకవర్గాలకు అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. రెండో జాబితాలో ఆరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉండగా.. మూడు స్థానాల్లోనే ఫైనల్ చేసింది. మరో మూడు స్థానాల్లో సస్పెన్షన్ కొనసాగుతూనే ఉంది. సూర్యాపేట, తుంగతుర్తి, మిర్యాలగూడ నియోజకవర్గాల అభ్యర్థులను ఖరారు చేయలేదు. దీంతో ఆ నియోజక వర్గాల్లో ఇంకా సస్పెన్స్ వీడలేదు. మునుగోడు స్థానాన్ని తమకు కేటాయించాలని సీపీఐ పట్టుబట్టినా.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ప్రకటించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో సీపీఐకి పొత్తులో భాగంగా టికెట్ లేనట్లేనని తేలిపోయింది. ఇక మిర్యాలగూడ స్థానాన్ని సీపీఎంకు కేటాయిస్తారా? అక్కడ కాంగ్రెస్ పార్టీనే పోటీ చేస్తుందా? అన్నది తేలాల్సి ఉంది.

ఇప్పటికి 9 మంది అభ్యర్థులు ఖరారు

ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు తొమ్మిది మంది అభ్యర్థులు ఖరారయ్యారు. మొదటి జాబితాలో నల్లగొండ నుంచి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నాగార్జునసాగర్ నుంచి కుందూరు జైవీర్‌రెడ్డి, నకిరేకల్ నుంచి వేముల వీరేశం, ఆలేరు బీర్ల ఐలయ్య, హుజూర్‌నగర్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ నుంచి పద్మావతి పేర్లను ప్రకటించిన విషయం తెలిసిందే. రెండో జాబితాలో ముగ్గురు కలుపుకొని మొత్తంగా 9 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది.

సూర్యాపేటలో ఎవరికి?

సూర్యాపేట అభ్యర్థి ప్రకటన విషయంలో ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. అక్కడ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికే టికెట్ వస్తుందని భావిస్తున్నారు. అక్కడి నుంచి పటేల్ రమేష్‌రెడ్డి కూడా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అధిష్టానం ఎవరికి టికెట్ ఇస్తుందోనన్నది తేలాల్సి ఉంది.

తుంగతుర్తిలోనూ అదే తీరు..

తుంగతుర్తిలో గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయిన అద్దంకి దయాకర్ మళ్లీ టికెట్ ఆశిస్తున్నారు. అదే నియోజకవర్గానికి చెందిన మందుల సామేల్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు కూడా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి వెళ్లి ఢిల్లీలో మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారిద్దరు కూడా తుంగతుర్తి టికెట్ ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ టికెట్ ఎవరికిస్తారన్న సస్పెన్స్ నెలకొంది.

కాంగ్రెస్ టు కాంగ్రెస్.. వయా బీజేపీ

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్ పార్టీ నుంచే ప్రారంభమైంది. 2009లో లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి ఎంపీగా పోటీచేసి విజయం సాధించారు. 2014 లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ఆ తరువాత 2016లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మునుగోడు నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసి విజయం సాధించారు. ఆ పదవీకాలం ముగియకుండానే 2022లో కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. దీంతో మునుగోడులో వచ్చిన ఉప ఎన్నికల్లో బీజేపీ తరపున బరిలో దిగారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. మూడోసారి కాంగ్రెస్ పార్టీ తరపున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయబోతున్నారు.

మూడోసారి బరిలో బాలునాయక్

దేవరకొండ మండలం సూర్యతండాకు చెందిన బాలునాయక్ 2009 ఎన్నికల్లో దేవరకొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి గెలుపొందారు. 2014లో పొత్తులో భాగంగా సిట్టింగ్ స్థానం సీపీఐకి పోవడంతో ఆ ఎన్నికల్లో పోటీ చేయలేదు. అదే ఏడాది ఉమ్మడి చందంపేట మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున జెడ్పీటీసీగా గెలిచి ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిషత్ చైర్మన్ అయ్యారు. ఆ తరువాత 2016లో బీఆర్‌ఎస్‌లో చేరారు. 2017లో మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు మూడోసారి బరిలో ఉండబోతున్నారు.

రెండోసారి పోటీలో కుంభం అనిల్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీతోనే రాజకీయాల్లో కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేశారు. 2018లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడయ్యారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసి ఓడిపోయారు. ఈ సంవత్సరం జూలైలో కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆ తరువాత సెప్టెంబరులో మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ తరపున రెండోసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయబోతున్నారు.

మిర్యాలగూడ సీపీఎంకేనా?

కాంగ్రెస్ పార్టీతో పొత్తులో భాగంగా మిర్యాలగూడ స్థానాన్ని తమకు ఇవ్వాలని సీపీఎం పట్టుపడుతోంది. అక్కడి నుంచి జూలకంటి రంగారెడ్డిని పోటీలో దింపే ఆలోచనల్లో ఉంది. ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రకటించిన రెండు జాబితాల్లోనూ మిర్యాలగూడ అభ్యర్థిని ప్రకటించలేదు. దీంతో ఆ స్థానాన్ని సీపీఎంకే కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి.


మునుగోడులో ఫ్రెండ్లీ కాంటెస్ట్ దిశగా సీపీఐ

కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 4 స్థానాలు కావాలని సీపీఐ, సీపీఎం అడిగాయి. అందులో ఉమ్మడి జిల్లాలోని మునుగోడును సీపీఐ, మిర్యాలగూడను సీపీఎం అడిగాయి. దీంతో ఒక్కటే ఇస్తామని కాంగ్రెస్ పార్టీ కూడా పేర్కొంది. అందులో మిర్యాలగూడను కేటాయించే అంశంపైనే ఆలోచన చేసింది. దీంతో మునుగోడును తమకు ఇవ్వకపోతే తాము పోటీలో ఉంటామని సీపీఐ జిల్లా కమిటీ తీర్మానం కూడా చేసింది. ఫ్రెండ్లీ కాంటెస్ట్ చేస్తామని ప్రకటించింది. తాజాగా మునుగోడులో కాంగ్రెస్ పార్టీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని పోటీలో ఉంచుతున్నట్లు ప్రకటించడంతో సీపీఐ స్నేహపూర్వక పోటీచేయనుంది.

సూర్యాపేట జనగర్జన సభకు హాజరైన ప్రజలు



బీజేపీలో జోష్..!



బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కుటుంబ పాలనపై అమిత్‌షా విమర్శలు

- సూర్యాపేట సభ నుంచే బీసీ సీఎం ప్రకటన చేసిన బీజేపీ అగ్రనేత
- స్థానిక విశేషాలను ప్రస్తావించినప్పుడు చప్పట్లు కొట్టిన ప్రజలు
- పారిశ్రామిక కారిడార్‌గా మారుస్తామని హామీ ఇచ్చిన కిషన్‌రెడ్డి
- జనగర్జన సభకు భారీగా తరలొచ్చిన జనం

సూర్యాపేట : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జనగర్జన సభకు బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరు కావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ వచ్చింది. ప్రధానంగా ఈ సభ ద్వారా అమిత్‌షా.. నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూనే.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల కుటుంబ పాలనపై విమర్శలు చేశారు. ఈ సమయంలో సభకు హాజరైన ప్రజలు తమ చప్పట్లతో మద్దతు పలికారు. అమిత్‌షా తన ప్రసంగంలో.. సూర్యాపేట నియోజకవర్గంలో ప్రసిద్ధిగాంచిన సూర్యాపేట పాత శివాలయం, పిల్లలమర్రి చెన్నకేశవ ఆలయాన్ని ప్రస్తావించడంతో ఒక్కసారిగా జనం కేరింతలు కొట్టారు. అయోధ్యలో జనవరి 22వ తేదీన ప్రధాని మోదీ చేతుల మీదుగా జరగనున్న రామమందిర తొలిపూజకు సూర్యాపేట వాసులను ఆహ్వానించడంతో సభికులంతా హర్షధ్వానాలతో జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి అధికారాన్ని కట్టబెడితే.. బీసీ అభ్యర్థినే ముఖ్యమంత్రిని చేస్తామని ఈ వేదిక నుంచే ప్రకటించడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలతో పాటు ఇతర పార్టీల్లోనూ చర్చనీయాంశమైంది. అమిత్‌షా తన ప్రసంగాన్ని సాయంత్రం 4.35 గంటలకు ప్రారంభించి.. 4.55 గంటలకు ముగించారు. దాదాపు 20 నిమిషాల పాటు ప్రసంగం కొనసాగగా.. కిషన్‌రెడ్డి తెలుగులోకి అనువాదించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తన ప్రసంగంలో సూర్యాపేట జిల్లాకు రైల్వే లైన్‌తో పాటు హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిని విస్తరించడం, పారిశ్రామిక కారిడార్‌గా మారుస్తామని చెప్పి జిల్లావాసులకు తీపి కబురు అందించారు.

కాషాయమయంగా..

ఎన్నికల నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా తీసుకుని సూర్యాపేట జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి జనసమీకరణ చేపట్టారు. ఇప్పటికే సూర్యాపేట, తుంగతుర్తి అభ్యర్థులను ప్రకటించగా ఈ ప్రాంతాల నుంచే జనం భారీగా తరలివచ్చారు. జనగర్జన సభతో సూర్యాపేటలోని ప్రధాన కూడళ్లు కాషాయమయంగా మారాయి. సాయంత్రం 4గంటలకు సభ ఉంటుందని ప్రకటించగా.. చాలాముందుగానే జనం సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

నన్ను గెలిపిస్తే.. రైల్వేలైన్ తీసుకొస్తా

- సూర్యాపేట బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు



దురాజ్‌పల్లి, భానుపురి : సూర్యాపేట ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. కేంద్ర ప్రభుత్వం వద్దకు వెళ్లి రైల్వేలైన్ తీసుకొస్తానని సూర్యాపేట నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు జనగర్జన సభ వేదికగా ప్రకటించారు. బీఆర్‌ఎస్ పాలనలో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా సహజ వనరుల దోపిడీ జరిగిందన్నారు. మూసీ నదిలో ఉన్న ఇసుకను ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో అక్రమంగా తరలించి వేల కోట్లు సంపాదించారని ఆరోపించారు. కలెక్టరేట్ నిర్మాణం పేరుతో పేదల నుంచి వందలాది ఎకరాల భూమిని తక్కువ ధరకు అప్పనంగా లాక్కున్నారని ఆరోపించారు. రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం పూర్తికాకుండానే ఎన్నికల ముందు డ్రా తీసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. సంతల్లో పశువుల్లా అమ్ముడు పోయే పార్టీ కాంగ్రెస్ అని బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. భువనగిరి అభ్యర్థి గూడూరి నారాయణరెడ్డి మాట్లాడుతూ నాటి సాయుధ పోరాటాన్ని వివరిస్తూ రజాకార్ సినిమా తీస్తున్నానని, కేసీఆర్ తీరు అందులో చూడొచ్చని పేర్కొన్నారు. తుంగతుర్తి అభ్యర్థి కడియం రామచంద్రయ్య మాట్లాడుతూ ప్రజలు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అరాచకాలను మరువరని ఈ ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. బీజేపీ నాయకురాలు చల్లా శ్రీలతారెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అవినీతిని చూడలేక, పదవికి, పార్టీకి రాజీనామా చేసి వచ్చానని తెలిపారు. ప్రజలు ఓటుతో బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్, ఐటీ సహాయ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి రాజీవ్‌చంద్రశేఖర్, నాగార్జునసాగర్ అభ్యర్థి కంకణాల నివేదితారెడ్డి, మహబూబాబాద్ అభ్యర్థి హుస్సేన్‌నాయక్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు గొంగిడి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి, పోరెడ్డి కిశోర్‌రెడ్డి, రుక్మారావు తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న అమిత్‌షా, చిత్రంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థులు, నాయకులు

కొనుగోళ్లలో వేగం పెంచండి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి,యాదాద్రి : ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలక్టర్ హనుమంతు కె.జెండగే ప్రత్యేకాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుతో కలిపి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశామని, అందుకు అనుగుణంగా 312 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కాంటా వేయాలని సూచించారు. సమీక్షలో చౌటుప్పల్ ఆర్డీఓ జగన్నాథరావు, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా పౌర సరఫరాలు, వ్యవసాయ, కార్మిక, పశు సంవర్ధక శాఖల జిల్లా అధికారులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పాల్గొన్నారు.

ఆరుట్ల ప్రాంగణంగా నామకరణం



వైకుంఠద్వారం వద్ద పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

యాదగిరిగుట్ట : ఆలేరులో ఈ నెల 29 నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభ స్థలానికి ఆరుట్ల ప్రాంగణంగా నామకరణం చేసినట్లు ప్రభుత్వ విప్ గొంగిడి సునీత తెలిపారు. శుక్రవారం యాదగిరిగుట్టలో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వైకుంతద్వారం వద్ద పూజలు చేసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. మూడవసారి బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. ఆలేరు నుంచి మూడవసారి భారీ మెజార్టీతో విజయం సాధిస్తానన్నారు. ప్రజా ఆశీర్వాద సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. యాదగిరిగుట్ట మండల పరిధిలోనూ తాను సెంటిమెంట్‌గా భావించే సైదాపురం నుంచి ప్రచారం ప్రారంభించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, 2014, 2018 ఎన్నికల్లో, ఇప్పుడు కూడా సైదాపురం నుంచే గొంగిడి దంపతులు ప్రచారం ప్రారంభించారు.

హస్తం గూటికి క్యూ

- కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న చేరికలు
- మల్లికార్జున ఖర్గే సమక్షంలో చేరిన రాజగోపాల్‌రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, నేతి విద్యాసాగర్
- నకిరేకల్ ఎంపీపీ దంపతులు కూడా కాంగ్రెస్ తీర్థం



మల్లికార్జున ఖర్గేతో మోత్కుపల్లి, నేతి విద్యాసాగర్, రాజగోపాల్‌రెడ్డి, నకిరేకల్ ఎంపీపీ దంపతులు, చిత్రంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కేసీ వేణుగోపాల్, మాణిక్‌రావుఠాక్రే

సాక్షి ప్రతినిధి, నల్లగొండ, సాక్షి యాదాద్రి : కాంగ్రెస్ పార్టీలో చేరికల జోరు కొనసాగుతోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరుతుండగా గురువారం రాత్రి, శుక్రవారం ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలు కోమటిరెడి రాజగోపాల్‌రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, నేతి విద్యాసాగర్ 'హస్తం' గూటికి చేరారు. 2018లో మునుగోడు నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి 2022 వరకు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తన నియోజకవర్గ అభివృద్ధి విషయంలో వివక్ష చూపిస్తున్నదని, మునుగోడు అభివృద్ధి కావాలంటే పార్టీ మార్పు తప్పదని ఎమ్మెల్యే పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఆయన తిరిగి గురువారం రాత్రి ఢిల్లీలో కాంగ్రెస్‌లో చేరారు.

నకిరేకల్ నియోజకవర్గం నుంచి..

నకిరేకల్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకుడు, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ కూడా కాంగ్రెస్ గూటికి చేరారు. ఆయన మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికై బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీలో చేరారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా కూడా పనిచేశారు. మళ్లీ ఎమ్మెల్సీ కోసం ప్రయత్నం చేశారు కానీ అవకాశం దక్కలేదు. దీంతో ఆయన ఇప్పుడు కాంగ్రెస్ గూటికే చేరారు. ఆయనతో పాటు నకిరేకల్ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి, ఆమె భర్త గంగాధర్‌రావు కూడా బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు.

రెండోసారి కాంగ్రెస్ గూటికి మోత్కుపల్లి

మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు రెండవ సారి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1983 నుంచి టీడీపీలో కొనసాగిన మోత్కుపల్లి 1999 సాధారణ ఎన్నికలకు ముందు ఆయన వైఎస్ రాజశేఖరరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరి ఆలేరు నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ వెంటనే కొన్ని రోజులకే టీడీపీలో చేరారు. టీడీపీ, కాంగ్రెస్ నుంచి, ఇండిపెండెంట్‌గా మొత్తం ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన మోత్కుపల్లి నర్సింహులు చంద్రబాబును విభేదించి టీడీపీ నుంచి బహిష్కృతుడయ్యారు. ఆ తర్వాత బీజేపీలో చేరారు. 2022లో కేసీఆర్ దళిత బంధు ప్రకటించడంతో మోత్కుపల్లి కేసీఆర్‌సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అయితే కేసీఆర్ తనకు కనీస గౌరవం ఇవ్వడంలేదని ఇటీవల ఆయన నిరసన గళమెత్తారు. ఆలేరు నుంచి లేదా ఉమ్మడి జిల్లాలో ఎక్కడినుంచైనా పోటీ చేస్తానని బహిరంగంగా ప్రకటించారు. సిట్టింగ్‌లకే సీట్లు ఇవ్వడంతో ఆయనకు అవకాశం దక్కలేదు. ఆ తర్వాత స్తబ్దుగా ఉండిపోయారు. కాంగ్రెస్‌లో చేరేందుకు ఆయన ఇటీవల కర్ణాటక డిప్యూటీ సీఎంను కలిసి వచ్చారు. తాజాగా కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఎన్నికల్లో ఏ సమస్యా రావద్దు

- అడిషనల్ సీపీ తరుణ్‌జోషి

సాక్షి,యాదాద్రి : జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు, భద్రతా చర్యలను శుక్రవారం రాచకొండ కమిషనరేట్ అడిషనల్ సీపీ తరుణ్‌జోషి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్రతో కలిసి పరిశీలించారు. భువనగిరిలోని అరోరా ఇంజనీరింగ్ కళాశాల, ఆలేరులోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి పోలీసు అధికారులకు సూచనలు చేశారు. ఏ చిన్న సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, అడిషనల్ డీసీపీ రవికుమార్, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, ఏసీపీలు వెంకటరెడ్డి, శివరాంరెడ్డి ఇతర ఎన్నికల, పోలీసు అధికారులు ఉన్నారు.

ఆలేరులో ప్రజా ఆశీర్వాద సభాస్థలిని సందర్శించిన పోలీసు అధికారులు

ఆలేరురూరల్ : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 29న ఆలేరులో సీఎం కేసీఆర్ పాల్గొనే ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను శుక్రవారం అడిషనల్ సీపీ తరుణ్‌జోషి, డీసీపీ రాజేశ్‌చంద్ర పరిశీలించారు. హెలిపాడ్‌ను తనిఖీ చేశారు. పటిష్ట భద్రత ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషన్ డీసీపీ రవికుమార్, ఏసీపీ శివరాంరెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్‌ఐ వెంకటశ్రీను పాల్గొన్నారు.



ఆలేరులో సభా స్థలిని పరిశీలించి పోలీసులకు సూచనలు చేస్తున్న అడిషనల్ సీపీ తరుణ్‌జోషి



సూర్యాపేట జనగర్జన సభలో అభివాదం చేస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, వేదిక కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థులు, నాయకులు



వేదిక పైన అమిత్‌షాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కేంద్ర మంత్రి అమిత్‌షాకు గులాబీ ఇస్తున్న సూర్యాపేట అభ్యర్థి సంకినేని

బీజేపీ సభ సైడ్‌లైట్స్..

- జనగర్జన సభకు అమిత్‌షా సాయంత్రం 4.05గంటలకు సూర్యాపేటలోని ఎస్వీ డిగ్రీ కళాశాలకు హెలికాప్టర్‌లో చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సభా ప్రాంగణానికి 4.14 గంటలకు వచ్చారు.
- 4.35 నుంచి 4.55 గంటల వరకు సభలో ప్రసంగించారు.
- 5.15గంటలకు ఎస్వీ కాలేజీ నుంచి హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్‌కు బయలుదేరారు.
- బీజేపీ తరఫున ఉమ్మడి జిల్లాలో పోటీచేస్తున్న అభ్యర్థులను అమిత్‌షా పేరుపేరునా సభికులకు పరిచయం చేశారు. ఆ సమయంలో ప్రజలు చప్పట్లుకొట్టి మద్దతు పలికారు.
- చుట్టూముట్టు సూర్యాపేట.. నట్టనడుమ నల్లగొండ అంటూ రజాకార్లను తరిమికొట్టిన తీరుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సభలో ప్రస్తావించడంతో సభా ప్రాంగణం చప్పట్లు, ఈలలతో మారుమోగింది.

ఫిఫ్టీ.. ఫిఫ్టీ

- దేవరకొండ నియోజకవర్గంలో చెరో ఏడు సార్లు గెలుపొందిన కాంగ్రెస్, సీపీఐ
- 2018లో టీఆర్‌ఎస్ విజయం
- ఇక్కడి నుంచి భారతీరాగ్యానాయక్ ఏకగ్రీవం



అసెంబ్లీ ఫ్లాష్‌బ్యాక్

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గం కాంగ్రెస్, కమ్యూనిస్టులకు కంచుకోటగా గుర్తింపు పొందింది. 1957లో ఏర్పడిన ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఏడు సార్లు సీపీఐ, ఏడు సార్లు కాంగ్రెస్, ఒకసారి టీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఈ నియోజకవర్గం తొలుత జనరల్ స్థానంగా ఉండేది.. తర్వాత ఎస్టీ నియోజకవర్గంగా ఏర్పాటైంది. 1999లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన ధీరావత్ రాగ్యా నాయక్ మద్దిమడుగు దేవాలయం వద్ద జరిగిన నక్సలైట్ల కాల్పుల్లో మృతి చెందాడు. 2002లో ఉప ఎన్నికలు అనివార్యం కాగా రాగ్యానాయక్ సతీమణి ధీరావత్ భారతి రాగ్యా నాయక్‌ను అన్ని పార్టీలు ఏకగ్రీవం చేశాయి.



బొడ్డుపల్లి రామశర్మ



డి.రవీంద్ర నాయక్



మోదు బద్దుచౌహాన్



ధీరావత్ రాగ్యానాయక్



భారతీ రాగ్యానాయక్



రవీంద్ర కుమార్



బాలు నాయక్



ఎలిమినేటి పెద్దయ్య

నియోజకవర్గ పరిస్థితి ఇలా..

దేవరకొండ నియోజకవర్గం చందంపేట, నేరెడుగొమ్ము, దేవరకొండ, డిండి, పీఏపల్లి, కొండమల్లేపల్లి, చింతపల్లి మండలాలు ఉన్నాయి. ఇటీవల కొత్తగా గుడిపల్లి మండలం ఏర్పాటైంది. ఇక్కడ ప్రధానంగా అత్యధిక శాతం గిరిజన జనాభా కలిగి ఉంది. ఇక్కడి రైతులు పత్తి ఎక్కువగా పండిస్తారు. అంతేకాకుండా దేవరకొండ పట్టణంలోని ఖిల్లాకు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. రేచర్ల పద్మనాయకుల ఏలుబడిలో దేవరకొండ ఖిల్లా ప్రఖ్యాతి గాంచింది. ఖిల్లా ప్రధాన ద్వారంపై గల పూర్ణకుంభం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధికార చిహ్నంగా ఉండేది. నియోజకవర్గంలో నక్కలగండి, ఏఎమ్మార్పీ, పెండ్లిపాకల రిజర్వాయర్, డిండి ప్రాజెక్టులు ప్రధాన నీటి వనరులను కలిగి ఉన్నాయి. దేవరకొండ మున్సిపాలిటీగా ఉంది.

ఎమ్మెల్యేగా బద్దుచౌహాన్ హ్యాట్రిక్..

దేవరకొండ ఎమ్మెల్యేగా సీపీఐకి చెందిన బద్దు చౌహాన్ వరుసగా 1985, 1989, 1994లో ఎమ్మెల్యేగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. ప్రస్తుత ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ 2004, 2014, 2018లో మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ అధిష్టానం సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న రవీంద్రకుమార్‌కు టికెట్ కేటాయించడంతో మరోమారు ఎన్నికల బరిలో నిలిచారు.

దేవరకొండ ఎమ్మెల్యేగా పనిచేసింది వీరే..

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ
1952	అనంతరామారావు	పీడీఎఫ్	మునగాల కొండల్‌రావు	కాంగ్రెస్
1957	గడ్డంపల్లి నారాయణరెడ్డి	కాంగ్రెస్	పల్లా పర్వత్‌రెడ్డి	పీడీఎఫ్
1962	ఎలిమినేటి పెద్దయ్య	సీపీఐ	ఎం.లింగయ్య	కాంగ్రెస్
1967	గడ్డంపల్లి నారాయణరెడ్డి	కాంగ్రెస్	పల్లా పర్వత్‌రెడ్డి	సీపీఐ
1972	బొడ్డుపల్లి రామశర్మ	సీపీఐ	దీప్‌లాల్‌చౌహాన్	కాంగ్రెస్
1978	డి.రవీంద్రనాయక్	కాంగ్రెస్	కె.హర్యానాయక్	సీపీఐ
1983	డి.రవీంద్రనాయక్	కాంగ్రెస్	కె.హర్యానాయక్	సీపీఐ
1985	ఎన్.బద్దుచౌహాన్	సీపీఐ	విజయలక్ష్మి	కాంగ్రెస్
1989	బద్దుచౌహాన్	సీపీఐ	రాగ్యానాయక్	కాంగ్రెస్
1994	బద్దు చౌహాన్	సీపీఐ	రాగ్యానాయక్	స్వతంత్ర
1999	రాగ్యానాయక్	కాంగ్రెస్	వశ్యానాయక్	టీడీపీ
2002	భారతిరాగ్యానాయక్	కాంగ్రెస్	(ఏకగ్రీవం)	
2004	రమావత్ రవీంద్రకుమార్	సీపీఐ	వడ్త్య శక్రునాయక్	టీడీపీ
2009	నేనావత్ బాలునాయక్	కాంగ్రెస్	రవీంద్రకుమార్	సీపీఐ
2014	రవీంద్రకుమార్	సీపీఐ	బిల్యానాయక్	టీడీపీ
2018	రవీంద్రకుమార్	టీఆర్‌ఎస్	బాలునాయక్	కాంగ్రెస్

జంగ్ తెలంగాణ

బకాయిలు చెల్లించాలి.. బాధలు తీర్చాలి



సూర్యాపేట డిపో ఆవరణలో ఆర్టీసీ కార్మికులు



- ఆర్టీసీ విలీనం.. కార్మికులు నష్టపోయేలా ఉండొద్దు
- సిబ్బంది అనుమానాలను నివృత్తి చేయాలి
- పనిభారం తగ్గించి.. వేధింపులను ఆపాలి
- ఆర్టీసీ ఎండీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- రిటైర్‌మెంట్ వయస్సు 58 ఏళ్లు చాలు
- యూనియన్లను గుర్తించి.. ఎన్నికలు నిర్వహించాలి
- కార్మికులు బాగుంటేనే సంస్థకు లాభం

'సాక్షి' పీపుల్స్ ఎజెండాలో బాధలు చెప్పుకున్న ఆర్టీసీ కార్మికులు

పీపుల్స్ ఎజెండా

పండుగ.. పబ్బం మరిచి జనాన్ని తమ గమ్యస్థానాలకు చేర్చే సురక్షితమైన సేవకులు. కుటుంబాన్ని వదిలి, జీవితాన్ని త్యాగం చేసి గంటల తరబడి ప్రయాణాలతో ప్రజలకు సేవలందిస్తున్నారు ఆర్టీసీ కార్మికులు. కాలంతో పోటీ పడి పనిచేసినా సరైన గుర్తింపు రావడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇతర ఉద్యోగులతో పోల్చితే కష్టానికి తగ్గ ఫలితం దక్కకపోగా.. వేధింపులు, పనిభారంతో మానసికంగా అలసిపోతున్నామని వాపోతున్నారు. శాసనసభ ఎన్నికల హడావుడి నేపథ్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో కార్మికులతో 'సాక్షి' ముచ్చటించింది. కార్మికులు తమ కష్టనష్టాలను వివరిస్తూ 'పీపుల్స్ ఎజెండా'లో భాగస్వాములయ్యారు. – సూర్యాపేట / భానుపురి

ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు ఉద్యమంలో ఆర్టీసీ కార్మికుల పాత్ర మరువలేనిది. ఉద్యమం ఉవ్వెత్తున సాగడంలో కార్మికుల సమ్మెనే కీలకం. అలాంటి కార్మికులు తెలంగాణ రాష్ట్రంలో కష్టనష్టాలు, ఒడిదొడుకులను ఎదుర్కొంటూ ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రధానంగా ఆర్థిక పరమైన ఇబ్బందులు కార్మికులను మానసికంగా వేదనకు గురి చేస్తున్నాయని వారంతా ఆవేదన చెందుతున్నారు. ఉద్యోగ భద్రతకు ప్రధానమైన విలీన అంశంతో పాటు ఆర్థికపరమైన ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వేధింపులు లేకుండా చూడాలని, ప్రభుత్వం చేపట్టే విలీనం కార్మికులకు నష్టం కలిగేలా కాకుండా.. ప్రయోజకరంగా ఉండాలని అంటున్నారు. ఇందుకోసం ఇప్పటికే కార్మికులకు బకాయిపడిన అన్నిరకాల ఆర్థిక పరమైన చెల్లింపులను తక్షణమే చేపట్టాలని కోరుతున్నారు.

కార్మికులకు గుర్తింపు ఉండడం లేదు



ప్రత్యేక రాష్ట్రమొస్తే ఇబ్బందులు లేకుండా ఉద్యోగాలు చేసుకోవచ్చని, జీతాలు బాగుంటాయని భావించాం. ఈ తొమ్మిదేళ్లలో కార్మికుల కష్టాలు ఏ మాత్రం మారలేదు. పైగా సంస్థ బాగు కోసం పనిచేసే కార్మికులపై వేధింపులు ఎక్కువయ్యాయి. కష్టాన్ని గుర్తించడం లేదు. పీఆర్సీలు, విలీనం అంశాన్ని కొలిక్కి తీసుకురావాలి. ఏరియర్స్, బాండ్ల బకాయిలు చెల్లించాలి. మృతిచెందిన కార్మికుల పిల్లలను కారుణ్య నియామకాల్లో భాగంగా విధుల్లోకి తీసుకోవాలి. – దోస్‌వాన్ రవినాయక్



బస్సు నడుపుతున్న ఆర్టీసీ డ్రైవర్

2013 జీతాలనే తీసుకుంటున్నాం



ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు వేతనాల విషయంలో చాలా అన్యాయం చేసింది. అన్నిరకాల ఉద్యోగులకు పీఆర్సీని ఇచ్చింది. ఆర్టీసీ కార్మికులకు అమలు చేయకపోవడంతో 2013 నాటి జీతాలనే ఇప్పటికీ తీసుకుంటున్నాం. డీఏలు, ఏరియర్స్, పీఆర్సీ బకాయిలు ఉన్నాయి. ఆర్థిక పరమైన అన్ని సమస్యలను పరిష్కరించాలి. – బత్తుల సుధాకర్

బతుకులు మారుతాయని ఆశించాం



పోరాడి సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే మన బతుకులు మారుతాయని ఆశించాం. 90 శాతం మంది మద్దతు ఇచ్చి గెలిపించుకున్నాం. ఇప్పుడేమో ఆగమాగం అయ్యాం. ఆర్టీసీని విలీనం చేస్తారని సంతోషపడ్డాం. పీఆర్సీ వస్తుందనుకున్నాం. విలీనం ఫైల్ ఎక్కడుందో తెలియని పరిస్థితి. జీతాలు ఎక్కడి నుంచి వస్తున్నాయో తెల్వదు. యూనియన్లను తీసుకెళ్లి గంగలో కలిపారు. ఓ వెల్ఫేర్‌ను తీసుకొచ్చి డ్రామాలు చేశారు. ఆర్టీసీ కార్మికులు ఎన్నో సమస్యలతో బాధపడుతున్నారు. వాటన్నింటినీ తీర్చాలి. – కొండా శ్రీధర్

58 ఏళ్లకే పరిమితం చేయాలి



ప్రభుత్వం రిటైర్మెంట్ వయస్సును 61 ఏళ్లకు పెంచింది. ఈ పెంపుతో ప్రధానంగా ఆర్టీసీ డ్రైవర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యానికి గురై బస్సులు నడిపే ఓపిక ఉండడం లేదు. ఈ వయస్సును 58 ఏళ్లకే పరిమితం చేయాలి. పేస్కేల్ సమస్య తీర్చాలి. పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నింటినీ ఇవ్వాలి. కొందరు చదువురాని డ్రైవర్లకు టిమ్స్ అప్పగించి ఒత్తిడికి గురి చేస్తున్నారు. లేదంటే ఇంకో డిపోనకు బదిలీ చేస్తామని వేధిస్తున్నారు. ఈ పనిభారాన్ని తగ్గించాలి. ఆర్టీసీ కార్మికుల సమస్యలన్నీ ఎన్నికలకు ముందే తీర్చితే బాగుండేది. – బద్దం శోభన్‌బాబు

ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం



ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సంతోషదాయకమే. ఈ విషయమై కార్మికుల్లో ఆందోళన, అనుమానాలు ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీల బకాయిలను విడుదల చేయాలి. కార్మికులకు జీతాలు చాలా తక్కువగా ఉన్నాయి. ప్రతినెలా కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నాం. ఒక్కో ఉద్యోగికి 185 నెలల డీఏ ఏరియర్స్.. దాదాపు సీనియర్లకు రూ.4 లక్షలు, ఇతర ఉద్యోగులకు రూ.2 లక్షల వరకు రావాల్సి ఉంది. ఇవన్నీ ఇస్తే ఆర్థికంగా ఇబ్బందులు ఉండవు. – కె.భాస్కర్

మాట నిలుపుకుంటారని ఆశిస్తున్నాం



ఆర్టీసీ నష్టాల నుంచి బయటపడుతోంది. సంస్థ లాభాల్లోకి వస్తే బకాయిలు ఇస్తామని ఎండీ చెప్పారు. పెండింగ్‌లో ఉన్న అన్నిరకాల సమస్యలు పరిష్కరిస్తామని మాట ఇచ్చారు. ఈ మాటను నిలుపుకుంటారని ఆశిస్తున్నాం. అలాగే ఆర్టీసీ చరిత్రలోనే ఈ దసరాకే పండుగ అడ్వాన్స్ ఇవ్వలేదు. తిరిగి ఇలా చేయకుండా కార్మికులను ఆదుకోవాలి. విలీనం అంశాన్ని పూర్తిచేయడంతో పాటు కార్మికులకు ఉన్న అనుమానాలను తీర్చాలి. – శ్రీకంఠం

వేధింపులు మానుకోవాలి



యాజమాన్యం కార్మికులపై పనిభారాన్ని మోపుతోంది. కిలోమీటర్లు పెంచి 8 గంటల పనివిధానాన్ని ఎత్తివేసింది. పనిభారం పెరగడంతో కార్మికులు ఒత్తిడికి గురవుతున్నారు. కార్మికులు ఇతర పనులు చేసే వెసులుబాటు ఉండదు. సంస్థలో జీతాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఖర్చులు పెరిగి ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రభుత్వంలో విలీనం చేసినా ఆర్థికంగా నష్టపోకుండా చూసుకోవాలి. – ఎస్. శ్రీనివాస్

ఎన్నికలు నిర్వహించాలి



ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలను ఎవరూ తీర్చడం లేదు. డీఏలు, పీఆర్సీ బకాయిలు చాలా ఇవ్వాల్సి ఉంది. ఇవన్నీ చెల్లిస్తే ఆర్థికంగా చాలా మేలు జరుగుతోంది. పనిగంటలు తగ్గించాలి. టిమ్‌లను డ్రైవర్లను అప్పగించకుండా కండక్టర్లను విధుల్లోకి తీసుకోవాలి. కొంతకాలం క్రితం రద్దు చేసిన యూనియన్లను తిరిగి గుర్తించాలి. వెంటనే యూనియన్లకు ఎన్నికలు నిర్వహించి కార్మికుల పక్షాన యాజమాన్యం ఉండాలి. వెల్ఫేర్ కమిటీలతో కార్మికులకు ఏమాత్రం ప్రయోజనం లేదు. – బి.రమేష్

బకాయిలు చెల్లించి విలీనం చేయాలి



ప్రస్తుతం ఆర్టీసీ కార్మికులకు చెల్లించాల్సిన అన్నిరకాల బకాయిలను చెల్లించాలి. ఆ తర్వాతనే విలీనం చేయాలి. అప్పుడే కార్మికులకు ప్రయోజనం ఉంటుంది. సీసీఎస్‌ను బలోపేతం చేయాలి. ఎప్పటికప్పుడు కార్మికులు రుణాలు అందించి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూడాలి. జీతాలు తక్కువగా ఉండి ఆర్థిక సమస్యల కారణంగా ఒత్తిడికి గురవుతున్నారు. ఈ సమస్యలన్నింటినీ తీర్చితేనే ఒత్తిడి లేకుండా పనిచేస్తారు. కార్మికులతో పాటు సంస్థ బలోపేతమవుతోంది. – ఎస్‌సీ.సైదులు

రూ.17లక్షల నగదు పట్టివేత

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ నుంచి కుంచపర్తి రాధాకృష్ణ రూ.17,12,070లక్షలను సాగర్ రోడ్డులోని శివ గణేశ్‌పత్తి మిల్లుకు తీసుకెళ్తుండగా పోలీసులు తనిఖీ చేసి సీజ్ చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థుల బయోడెటా ఇదే..

దేవరకొండ :
నేనావత్ బాలునాయక్

తల్లిదండ్రులు : లస్కర్, గమానీ
భార్య : జ్యోతి
సంతానం : కుమారుడు అభిలాష్, ఇద్దరు కుమార్తెలు
విద్యార్హత : ఎంఏ
స్వస్థలం : సూర్యతండా, దేవరకొండ మండలం
చేపట్టిన పదవులు : 2001లో దేవరకొండ జెడ్పీటీసీ, 2008 నుంచి 2009 వరకు దేవరకొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా, 2009లో దేవరకొండ ఎమ్మెల్యేగా, 2014లో చందంపేట జెడ్పీటీసీగా గెలుపొంది.. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2018లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు.

భువనగిరి :
కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

తల్లిదండ్రులు : శ్రీనివాస్‌రెడ్డి, ప్రేమలత
విద్యార్హత : బీఈ సివిల్ ఇంజనీరింగ్
భార్య : కిరణ్‌జ్యోతి
కుమారుడు : శ్రీరాంరెడ్డి
కుమార్తెలు : కీర్తిరెడ్డి, స్ఫూర్తిరెడ్డి
స్వగ్రామం : వలిగొండ (ప్రస్తుతం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్)

మునుగోడు :
కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

తల్లిదండ్రులు : పాపిరెడ్డి-సుశీలమ్మ
భార్య : లక్ష్మి
కుమారుడు : సంకీర్త్‌రెడ్డి
విద్యార్హత : బీఏ
స్వగ్రామం : బ్రాహ్మణవెల్లెంల, నార్కట్‌పల్లి మండలం

కట్టంగూర్‌లో సెంట్రల్ ఫోర్స్ కవాతు



కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల, కట్టంగూర్, కలిమెర, మునుకుంట్ల, ఈదులూరు, దుగినవెల్లి, ముత్యాలమ్మగూడెం గ్రామాల్లోని వీధుల్లో శుక్రవారం సెంట్రల్ ఫోర్స్ ఐటీబీటీ సిబ్బంది కవాతు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతిభద్రతల సంరక్షణకు కవాతు నిర్వహించినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫాం-12డి పంపిణీ

భువనగిరి : ఎన్నికల సంఘం ఈ సారి 80 ఏళ్ల పైబడిన వృద్ధులతో పాటు దివ్యాంగులు ఇంటి వద్ద నుంచే ఓటు వేసేందుకు అవకాశం కల్పించింది. అందులో భాగంగా వారికి బ్యాలెట్ పేపర్లు ఇంటికే ఇచ్చేందుకుగాను ముందుగా ఫాం-12డి ఇవ్వనున్నారు. వీటిని పూర్తి చేసి బీఎల్ఓల ద్వారా అధికారులు స్వీకరించనున్నారు. భువనగిరి నియోజకవర్గంలో ఫాం-12డి పంపిణీ ప్రక్రియ రెండు రోజులుగా కొనసాగుతోంది. ఈ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,11,362 మంది ఉండగా.. ఇందులో 80 సంవత్సరాల వయస్సు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు మొత్తం 3,524 మందిని గుర్తించారు.



భువనగిరి మండలం రాయగిరి గ్రామంలో ఫాం 12డి అందజేస్తున్న బీఎల్ఓ

ఎమ్మెల్యేలకు నిరసన సెగ



ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌ను ప్రశ్నిస్తుండగా వారిస్తున్న రాముని గుండ్లతండా సర్పంచ్

కొండమల్లేపల్లి : ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని వడ్త్యతండా, గాజీనగర్, చింతచెట్టు తండా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌ను పలు సమస్యలపై నిలదీశారు. తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ప్రభుత్వం ఇళ్లను కేటాయించలేదని బహిరంగంగానే కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తామని అన్నారు. గాజీనగర్‌కు వచ్చే రహదారిలో కల్వర్టు ఏర్పాటు చేయాలని, వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. ప్రస్తుత ఎమ్మెల్యే రవీంద్రకుమార్ 2018లో ప్రచారానికి వచ్చి మళ్లీ 2023లో ప్రచారానికి మా గ్రామానికి వచ్చారని వడ్త్యతండా గ్రామ ప్రజలు ఎమ్మెల్యేను ప్రశ్నించారు. గాజీనగర్ ఎంపీటీసీ నేనావత్ లక్కిదాస్‌నాయక్ ఎలాంటి పనులు చేయలేదని ఆరోపించారు. వారి ప్రశ్నలతో కొంత అసహనానికి గురైన ఎమ్మెల్యే తీవ్ర పదజాలంతో ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. మండలలో ప్రచారం మొదలుపెట్టిన మొదటి రోజే ఎమ్మెల్యేకు నిరసనలు ప్రారంభమైంది.

ఆలేరు ఎమ్మెల్యేకు..

గుండాల : ఎమ్మెల్యే గొంగిడి సునీతకు నిరసన సెగ తగిలింది. శుక్రవారం ఆమె గుండాల మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్లగా వెళ్లారు. బండకొత్తపల్లిలో మాట్లాడుతుండగా గ్రామానికి చెందిన కొందరు దళితులు తమకు దళితబంధు రాలేదని ప్రశ్నించగా వారిని సముదాయించి ప్రసంగాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత బుషిగంపల అంజయ్య తన తల్లి దరఖాస్తు చేసుకున్నా పింఛన్ రావడం లేదని నిలదీశారు. దీంతో అసహనానికి గురైన ఎమ్మెల్యే ప్రచార రథం దిగి వెళ్లిపోయారు. అలాగే వస్తాకొండూర్‌లో తమ గ్రామానికి రాత్రి సమయంలో బస్సు రావడం లేదని పలువురు మహిళలు ప్రశ్నించారు. బీసీబంధు, కల్యాణలక్ష్మి పథకాలు బీఆర్‌ఎస్ కార్యకర్తలకే ఇస్తున్నారంటూ కొందరు ఆమె ప్రసంగాన్ని అడ్డుకున్నారు. ఇదే గ్రామంలో రైతు ననుబోతు యాదగిరి తన వ్యవసాయ భూమిని అధికార పార్టీ నాయకుడు తన పేరున లేకుండా చేశారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాడు. పాచిల్ల గ్రామంలోనూ దళితబంధు, బీసీబంధు ఇవ్వలేదంటూ కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన తెలిపారు.



గుండాల : వస్తాకొండూర్‌లో ఎమ్మెల్యే సునీతను నిలదీస్తున్న రైతు ననుబోతు యాదగిరి

క్లుప్తంగా

డిగ్రీ బ్యాక్‌లాగ్ పరీక్షల షెడ్యూల్ విడుదల

రామగిరి(నల్లగొండ): అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ బ్యాక్‌లాగ్ పరీక్షల షెడ్యూల్‌ను యూనివర్సిటీ అధికారులు శుక్రవారం విడుదల చేశారు. 2016 అంత కంటే ముందు డిగ్రీ కోర్సుల్లో చేరిన మొదటి, ద్వితీయ, తృతీయ సంవత్సరం బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులు అక్టోబర్ 30నుంచి నవంబర్ 11తేదీలోపు ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించాలని, అపరాధ రుసుము రూ.500లతో నవంబర్ 23వతేదీ లోపు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. ప్రథమ సంవత్సరం పరీక్ష డిసెంబర్ 9నుంచి 14వ తేదీ వరకు ఉదయం 10నుంచి 1గంట వరకు ఉంటుందని, తృతీయ సంవత్సరం మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు, ద్వితీయ సంవత్సరం డిసెంబర్ 16నుంచి 21వరకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎయిర్ లైన్స్ విభాగం మాజీ అధికారి లక్ష్మారెడ్డి మృతి


తాదూరి లక్ష్మారెడ్డి (ఫైల్)

మోత్కూరు : మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాపురం గ్రామానికి చెందిన ఇండియన్ ఎయిర్ లైన్స్ విభాగంలో జూనియర్ వారెంట్ రిటైర్డ్ అధికారి తాదూరి లక్ష్మారెడ్డి (76) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. లక్ష్మారెడ్డి ఉద్యోగ విరమణ అనంతరం జీహెచ్‌ఎంసీలో సర్వీస్ ఇంజనీర్‌గా, ఇండియన్ ఇమ్యూనల్ లాజికల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా, అదే కంపెనీలో సెక్యూరిటీ, ఎస్టేట్ ఆఫీసర్‌గా సేవలందించారు. స్వగ్రామమైన ధర్మాపురంలో సుమారు రూ.50 లక్షలతో ఆంజనేయస్వామి దేవాలయాన్ని స్వంత డబ్బులతో నిర్మించారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం స్వగ్రామంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. లక్ష్మారెడ్డికి భార్య పద్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ యాదాద్రి జిల్లా చైర్మన్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ చింతల విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టి.మేఘారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు లక్ష్మారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

అండర్ 19 క్రికెట్ ఉమెన్స్ టీమ్ వైస్ కెప్టెన్‌గా వైష్ణవి


కుందారపు వైష్ణవి

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన కుందారపు వైష్ణవి హైదరాబాద్ అండర్ 19 ఉమెన్స్ టీ20 క్రికెట్ టోర్నమెంట్ 2023–24 (బీసీసీఐ) జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యింది. నవంబర్ 2నుంచి జార్ఖండ్‌లో జరిగే టీ20 టోర్నమెంట్‌లో వైష్ణవి పాల్గొననుంది. కాగా వైష్ణవి ఇప్పటి వరకు అండర్ 19 విభాగంలో కలకత్తా, గుజరాత్, చెన్నై, పూణాలో జరిగిన టీ20, వన్డే మ్యాచ్‌లో ఆడి జాతీయ స్థాయిలో ఆల్‌రౌండర్‌గా తన సత్తాచాటింది. వైష్ణవి టీ20 టీమ్‌కు వైస్ కెప్టెన్‌గా ఎంపికకా వడం పట్ల తండ్రి కుందారపు నర్సింహ, సర్పంచ్ దొడ్డి అలివేలు, మాజీ సర్పంచ్ బండి కృష్ణగౌడ్, నోముల మాధవరెడ్డి, గరిసె జంగయ్య, యాదగిరి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


కోటయ్య (ఫైల్)

కనగల్ : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని శాబ్దుల్లాపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అంతిరెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సోము కోటయ్య(45) వ్యవసాయంతో పాటు ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లి వస్తానని కోటయ్య కుటుంబ సభ్యులకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. రాత్రి 9గంటలైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికారు. అయినా అతడి ఆచూకీ దొరకలేదు. అయితే శుక్రవారం ఉదయం అదే గ్రామానికి చెందిన కోయ మోహన్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో గల ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ తీగలకు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెంది ఉండటాన్ని స్థానిక రైతులు గమనించి గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే కోటయ్య శరీరం పూర్తిగా కాలిపోయి మృతి చెందాడని వారు పేర్కొన్నారు. మృతుడి కుమారుడు అర్జున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు, మృతదేహాన్నిపోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

అవినీతి బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించాలి

- మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి

నాగారం : అవినీతి, నియంతృత్వ దోపిడీ పాలన చేస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ఓడించాలని తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక కన్వీనర్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బస్సు యాత్ర శుక్రవారం నాగారం మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు 9సంవత్సరాలుగా అధికారంలో ఉండి ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ రైతాంగాన్ని, నిరుద్యోగులను, కార్మికులను మోసం చేస్తున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను ఓడించి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు వినాయకరెడ్డి, లక్ష్మీనారాయణ, గోవర్దన్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జేవీ చలపతిరావు, జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, డివిజన్ కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్య, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, కునుకుంట్ల సైదులు, దేశోజు మధు తదితరులు పాల్గొన్నారు.


నాగారంలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి


తిరుమలగిరిలో మాట్లాడుతున్న మురళి

ప్రశ్నించే వారిపై దాడులు చేస్తున్నారు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తెలంగాణలో అధికార పార్టీ నాయకులను ఎన్నికల హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తే వారిపై దాడులు చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక కన్వీనర్, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక బస్సు యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. తెలంగాణ వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయనుకుంటే ఉద్యోగాలు రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తే శ్మశాన తెలంగాణగా మారుతుందన్నారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఇసుక మాఫియా సాగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం డబుల్ బెడ్‌రూంల గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దళిత బంధులో కమీషన్లు తీసుకొని మోసం చేశారని విమర్శించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం రాష్ట్రంలో 22లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే 50వేల మందికి కూడా ఇళ్లు రాలేదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఓడించాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు వినాయక్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, పృథ్వీరాజ్, సైకిబాబా, అన్వేష్, గోవర్దన్, జానయ్య, డేవిడ్‌కుమార్, నాగయ్య పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పేరుతో అవినీతికి పాల్పడిన కేసీఆర్

తుంగతుర్తి : తెలంగాణలో ప్రాజెక్టుల పేరుతో సీఎం కేసీఆర్ భారీ అవినీతికి పాల్పడ్డారని తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక కన్వీనర్ ఆకునూరి మురళి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బస్సు యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణను కేసీఆర్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నిలువునా ముంచిందన్నారు. కాళేశ్వరం, మిషన్‌భగీరథ ప్రాజెక్టుతో కేసీఆర్ కుటుంబం అవినీతికి పాల్పడిందన్నారు. ప్రతి పౌరుడు మద్యానికి, నోటుకు, కులానికి, మతాలకు లోబడకుండా ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో వినాయక్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, గోవర్దన్, చలపతిరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి మాదిగల శక్తి చూపించాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ


నల్లగొండలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

నల్లగొండ టూటౌన్: ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 18న నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభతో దేశానికి మాదిగల శక్తి ఏంటో చూపించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలో నిర్వహించిన మాదిగల విశ్వరూప సన్నాహక సభకు హాజరై మాట్లాడారు. గతంలో పదేళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మాదిగలను నమ్మించి మోసం చేసిందని, ఆ మోసాన్ని గమనించి ఆ పార్టీకి పుట్టగతులు లేకుండా చేశామన్నారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని వాగ్దానం చేసి మాదిగలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టకుండా మోసం చేశారని ఆరోపించారు. నవంబర్‌లో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెడుతామని ప్రభుత్వ పెద్దలు హామీ ఇచ్చినట్లు ఆయన చెప్పారు. వచ్చే నెల 18న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే సభకు మాదిగలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ, జానకి రామయ్య చౌదరి, సునీల మాదిగ, గాదె రమేష్ మాదిగ, కందుకూరి సోమన్న మాదిగ, మల్లెపాక వెంకన్న మాదిగ, కమలమ్మ, రవీందర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు అండగా ఉన్నది ఎమ్మార్పీఎస్సే

భువనగిరిటౌన్ : తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌కు అండగా నిలిచింది ఎమ్మార్పీఎస్ మాత్రమేనని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఉద్యమాన్ని తమ భుజాలపై వేసుకుని నడిపించామన్నారు. విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన రథయాత్ర శుక్రవారం భువనగిరికి చేరింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమంలో అండగా ఉన్నది నువ్వు ఒక్కడివేనని ఆనాడు కేసీఆర్ తనతో అన్నారని మంద కృష్ణమాదిగ గుర్తు చేశారు. మాదిగ దండోరా మద్దతుతోనే తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని, అయినా ఒక్క మాదిగను కూడా మంత్రిని చేయలేదని విమర్శించారు. తాము ఏ పార్టీకి అనుకూలం కాదని.. వర్గీకరణమే ముఖ్యమని, మోదీ ఎస్సీ వర్గీకరణ చేస్తే బీజేపీకి మద్దతిస్తామన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే సభకు ప్రధాని మోదీ వచ్చేలా ప్రయత్నిస్తామన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వర్గీకరణకు మద్దతు ప్రకటించిన పార్టీలు ఇప్పుడు మౌనం వహిస్తుండడం బాధాకరమన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించి మాదిగ జీవితాల్లో వెలుగులు నింపేందుకే రథయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. నవంబర్ 18న హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభకు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు రామకృష్ణా, దేవేందర్ ఉన్నారు.

నేడు చలమల్ల కృష్ణారెడ్డి ప్రత్యేక సమావేశం

- భవిష్యత్ కార్యాచరణ ప్రకటించే అవకాశం

చౌటుప్పల్ : మునుగోడు నియోజకవర్గ టికెట్‌ను బీజేపీ నుంచి తాజాగా కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కేటాయించడంతో పీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి తన రాజకీయ భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించారు. అందులో భాగంగా శనివారం చౌటుప్పల్ మండలంలోని దామెర గ్రామంలో గల తనక్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఉదయం 11గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో పార్టీ శ్రేణులు, అనుచరుల నుంచి వచ్చే అభిప్రాయాల ఆధారంగా ఆయన నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ సమావేశం అనంతరం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి తన కార్యాచరణను ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

రాజగోపాల్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


రాజగోపాల్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంస్థాన్ నారాయణపురం : మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్టానం కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేరును ప్రకటించడాన్ని నిరసిస్తూ స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం రాత్రి గుజ్జ గ్రామంలో రాజగోపాల్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కష్టకాలంలో పార్టీని ఆదుకున్న చలమల్ల కృష్ణారెడ్డిని కాదని రాజగోపాల్‌రెడ్డికి టికెట్ ఇవ్వడం అన్యాయమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చాడ శ్రీను, మల్లికార్జున్‌రెడ్డి, వెలిజాల వెంకటేశం, లక్ష్మణ్, చాపల సైదులు, సంజీవరెడ్డి, ముత్యాలు, రాజశేఖర్‌రెడ్డి, సాయి తదితరులున్నారు.

రైలు పట్టాల మధ్య నిలిచిన ట్రాక్టర్

- స్థానిక రైతు సమాచారంతో అప్రమత్తమైన రైల్వే అధికారులు
- కుక్కడం సమీపంలో అరగంటపాటు పల్నాడు ఎక్స్‌ప్రెస్ నిలిపివేత


రైలు పట్టాల మధ్య నిలిచిన ట్రాక్టర్

మాడుగులపల్లి : రైలు పట్టాలు దాటుతున్న క్రమంలో ఓ ట్రాక్టర్ ట్రాలీతో సహ పట్టాల మధ్య నిలిచిపోయింది. స్థానిక రైతు వెంటనే రైల్వే అధికారులకు సమాచారం ఇవ్వడంతో మూడు కిలోమీటర్ల ముందే రైలును నిలిపేయడంతో ఘోర ప్రమాదం తప్పింది. వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రైతు సంపంగి చెన్నయ్య శుక్రవారం ఉదయం పొలం వద్ద కట్టెలను ట్రాక్టర్‌లో లోడు చేసుకొని చెరువుపల్లి శివారులో రైలు పట్టాల పైనుంచి దాటేందుకు యత్నించాడు. పట్టాల మధ్య కంకరలో టైర్లు కూరుకుపోయి ట్రాక్టర్ కదలకుండా మధ్యలో నిలిచిపోయింది. దీంతో స్థానిక రైతు వెంటనే 100కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. కారులో వెంటనే తిప్పర్తి వెళ్లి రైల్వే మాస్టర్‌కు విషయం చెప్పాడు. దీంతో అప్రమత్తమైన రైల్వే అధికారులు అదే సమయంలో గుంటూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న పల్నాడు ఎక్స్‌ప్రెస్ రైలును కుక్కడం–చెరువుపల్లి మధ్య నిలిపేశారు. అరగంటపాటు రైలు నిలిచిపోవడంతో ఏం జరిగిందో తెలియక ప్రయాణికులు గందరగోలానికి లోనయ్యారు. రైల్వే సిబ్బంది జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను పట్టాల పైనుంచి పక్కకు తొలగించి రైలును హైదరాబాద్ పంపారు. రైలు ట్రాక్టర్‌ను ఢీకొట్టి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేది. తిప్పర్తి రైల్వే మాస్టర్ ఫిర్యాదు మేరకు నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపిన చెన్నయ్యపై రైల్వే చట్టంలోని 154, 174 సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్‌ఐ పవన్ కుమార్‌రెడ్డి తెలిపారు.

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొని వ్యక్తికి గాయాలు

సూర్యాపేట క్రైం : ఆగి ఉన్న టిప్పర్‌ను ద్విచక్ర వాహనంతో ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. పట్టణంలోని కిశోర్ థియేటర్ సమీపంలో ఆగి ఉన్న టిప్పర్‌ను ద్విచక్రవాహనంతో ఓ వ్యక్తి ఢీకొట్టాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సమష్టి కృషితోనే బ్యాంకు లాభాల బాట


మాట్లాడుతున్న డీసీసీబీ వైస్ చైర్మన్ దయాకర్‌రెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్: డీసీసీబీ, పీఏసీఎస్‌ల పాలకవర్గాలు, బ్యాంకు ఉద్యోగులు సమష్టిగా కృషి చేయడంతోనే జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లాభాల బాటలో పయనిస్తోందని ఆ బ్యాంకు వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డీసీసీబీలో నిర్వహించిన మహజన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు పంటరుణాలను అందించడంలో డీసీసీబీ ముందుందన్నారు. రైతులు, ఖాతాదారులకు మెరుగైన సేవలను అందిస్తున్నామన్నారు. విద్యా, వ్యక్తిగత, వ్యాపార, మార్టిగేజ్ రుణాలను సైతం అందిస్తున్నామన్నారు. డిపాజిట్లు సేకరణ, బంగారు ఆభరణాలపై రుణాలను అందిస్తున్నామన్నారు. డీసీసీబీ సహకారంతో రైతు ప్రాథమిక సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నాయన్నారు. అనంతరం బ్యాంకు ఆధునీకరణ, ఇతర పనులపై తీర్మానాలను సభలో ఆమోదించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, సైదయ్య, అంజయ్య, సీఈఓ కె.మదన్‌మోహన్, డైరెక్టర్లు, సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


సంతోష్‌నాయక్ మృతదేహం

చివ్వెంల(సూర్యాపేట) : తల్లి హోటల్‌లో పనికి వెళ్లిందని మనస్థాపంతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధిలోని వల్లభాపురం ఆవాసం జగన్నాయక్ తండాలో గురువార అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగన్నాయక్‌తండాకు చెందిన సునావత్ సంతోష్‌నాయక్ (23) స్థానిక అమరావతి హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సంతోష్ తల్లి శుక్రవారం అదే హోటల్‌లోకి పనికి వచ్చింది, దీంతో అతడు పనికి వద్దు ఇంటికి రమ్మని పిలువగా ఆమె రాకపోవడంతో మనస్థాపానికి గురై ఇంటి ముందు ఉన్న విద్యుత్ స్తంభానికి అర్ధరాత్రి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన ఇరుగు పొరుగు వారు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ విష్ణుమూర్తి సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఎన్నికల్లో ముదిరాజ్‌లకు అవకాశం కల్పించాలి



ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న డాక్టర్ శంకర్

కోదాడరూరల్ : త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ముదిరాజ్ కులస్తులకు ఎమ్మెల్యే అభ్యర్థులుగా అవకాశం కల్పించాలని, ఆ పార్టీలకే మద్దతు తెలుపుదామని ముదిరాజ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రిటైర్డ్ ఏసీపీ బుడిగ అంజయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన కోదాడ నియోజకవర్గ ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ముదిరాజ్‌లు ఐక్యతతో ఉండి రాజ్యాధికారం సాధించుకుందామన్నారు. రాష్ట్రంలో 62లక్షలకు పైగా జనాభా ఉన్న తమ కులస్తులకు ఎందుకు ఒక్క ఎమ్మెల్యే టికెట్ కేటాయించలేదో బీఆర్‌ఎస్ పార్టీ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్‌లో క్రియాశీలకంగా ఉన్న ఈటెల రాజేందర్‌తో తన సీఎం సీటుకు ముప్పు వస్తుందని ఆయనను బయటకు పంపితే తిరిగి గెలిపించుకున్నామన్నారు. ముదిరాజ్ కులస్తులకు ఒక్క సీటు ఇవ్వని పార్టీలకు ఒక్క ఓటు కూడా వేయకుండా తమ సత్తాం ఎంటో చూపిద్దామన్నారు. సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముసి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు భాషబోయిన భాస్కర్‌రావు, టి.రామయ్య, మద్దెల సంతోష్, వనిత, సారగండ్ల సత్తయ్య, అల్లి వీరబాబు, పిట్టల లక్ష్మయ్య, చాప శ్రీను, వేముల రాముడు, పుల్లయ్య, శంకర్ పాల్గొన్నారు.

బీసీబంధు లబ్ధిదారుడు ఆత్మహత్యాయత్నం


ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సోమయ్య

గుండాల : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో బీసీబంధు లబ్ధిదారుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాలకు చెందిన కొడపర్తి సోమయ్య అదే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గిరికత్తుల శ్రీనివాస్‌గౌడ్ వద్ద కొంతకాలంగా జీతం ఉంటున్నాడు. దీంతో గ్రామ శాఖ అధ్యక్షుడు సోమయ్యకు బీసీబంధు సాయం ఇప్పించాడు. అయితే సోమయ్య ఇటీవల కాంగ్రెస్‌లో చేరాడు. దీంతో అధికార పార్టీ నేత కొడపర్తి లక్ష్మయ్య రెండు రోజులుగా తనను వేధింపులకు గురి చేస్తున్నాడని, బీసీబంధు లబ్ధి పొంది కాంగ్రెస్‌లోకి వెళ్లడం ఏమిటని దూషిస్తున్నట్లు బాధితుడు తెలిపాడు. అతని వేధింపులు తాళలేక శుక్రవారం తన భార్యను ఇంట్లో నుంచి బయటకు పంపించి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. భార్యకు అనుమానం వచ్చి ఇంటి తలుపులు తీయగా లోపల గడి వేసి ఉంది. చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు పగలగొట్టి బాధితుడిని కాపాడారు. తన భర్తను వేధింపులకు గురి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడి భార్య తెలిపింది.

అప్పుడే తాగునీటి కష్టాలు


కల్మేట్‌తండాలో ఎద్దుల బండిపై డ్రమ్ముల్లో నీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు


కల్మేట్‌తండాలో బోరు వద్ద నీటి కోసం క్యూ కట్టిన జనం

- జాన్‌పహాడ్, కల్మేట్‌తండాల్లో తాగునీటికి కటకట
- చిలుకూరులోనూ నీటి ఎద్దడి
- సరఫరాకాని మిషన్ భగీరథ నీరు
- ఎండిన గ్రామ పంచాయతీ బోర్లు

పాలకవీడు: భూగర్భ జలాలు అడుగంటడంతో పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్, కల్మేట్‌తండా గ్రామాల్లో తాగునీటికి కటకట ఏర్పడింది. ఇంటి అవసరాలకు, తాగడానికి నీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెండు గ్రామాల్లో సుమారు ఎనిమిది బోర్లలో ఏడు బోర్లు పూర్తిగా ఎండిపోగా ఒక బోరులో కొద్దిపాటి నీరు వస్తోంది. గ్రామస్తులంతా అక్కడి నుంచే ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల సాయంతో డ్రమ్ముల్లో నీటిని తెచ్చుకుని కాలం వెళ్లదీస్తున్నారు. మిషన్ భగీరథ నీరు సైతం నాలుగైదు రోజులకొకసారి వస్తోందని, అది కూడా అరగంటకు మించి రావడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. సర్పంచ్‌లు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నా పూర్తిస్థాయిలో అందడం లేదని చెబుతున్నారు. గ్రామంలో బోర్లు ఎండిపోయాయని, సాగర్ నీటితో చెరువును నింపాలని జాన్‌పహాడ్ సర్పంచ్ వెంకటేశ్వర్లు కోరుతున్నారు.

నీటి కోసం గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం


చిలుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేస్తున్న మహిళలు

చిలుకూరు: చిలుకూరు గ్రామంలో తాగునీటి కోసం పలువురు మహిళలు శుక్రవారం పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. గ్రామ పరిధిలోని 10వ వార్డులో నీటి సమస్యపై పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు సైతం రావడం లేదని మండిపడ్డారు. పంచాయతీ కార్యదర్శితో వాగ్వాదానికి దిగారు. కాగా.. కరెంట్ సమస్య కారణంగా నీరు రావడం లేదని, సమస్యను వెంటనే పరిష్కరిస్తామని సర్పంచ్ కొడారు బాబు, కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్ తెలిపారు.

ప్రచారానికి పద..పద..



వ్యవసాయ పనులకు, భవన నిర్మాణాలు, ఇతర పనులకు వెళ్లే కూలీలంతా ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో ప్రత్యక్షమవుతున్నారు. శుక్రవారం భువనగిరి మండలం తాజ్‌పూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి అనిల్‌కుమార్‌రెడ్డి తరపున మహిళా కూలీలు పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు. అభ్యర్థి ఎవరైనా పిలుపు రాగానే ఆ రోజు వెళ్లి జై కొడుతూ ఆదాయం పొందుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రిభువనగిరి

హత్యకేసును ఛేదించిన పోలీసులు

- భర్తను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించిన భార్య
- వివాహేతర సంబంధమే కారణమని పోలీసుల వెల్లడి
- మృతుడి భార్యతో పాటు ముగ్గురు నిందితుల అరెస్టు

సూర్యాపేట క్రైం : అక్రమ సంబంధంతో భర్తను అంతమొందించి ఆత్మహత్యగా చిత్రీకరించిన కేసును పట్టణ పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం రాత్రి ఎస్పీ రాహుల్ హెగ్డే జిల్లా పోలీసు కార్యాలయంలో వెల్లడించారు. చివ్వెంల మండలం కుడకుడ గ్రామంలోని భాగ్యనగర్‌కాలనీలో నివాసముంటున్న భూక్యా వెంకన్న వ్యవసాయం చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అదే కాలనీలో ఓ అద్దె ఇంట్లో నివాసముండే కారు డ్రైవర్ షేక్ రఫీ భార్య నస్రీన్‌తో భూక్యా వెంకన్నకు అక్రమ సంబంధం ఏర్పడింది. అయితే ఈ విషయమై రఫీ ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఎలాగైనా భూక్యా వెంకన్న అతడి భార్యను, నస్రీన్ భర్త రఫీని అడ్డు తొలగించుకోవాలని వెంకన్న, నస్రీన్ భావించారు. అందుకోసం వెంకన్న తన స్నేహితులైన మోతె మండలం సిరికొండ గ్రామానికి చెందిన జేఎస్ఎం అక్కనపల్లి శ్రీశైలం, మోతె మండలం నామవరం గ్రామానికి చెందిన సారగండ్ల మధుకు విషయాన్ని తెలిపాడు. దీంతో పథకంలో భాగంగా ఈ ఏడాది జూలై 8న వెంకన్న స్వగ్రామమైన భళ్లతండా నుంచి రాత్రి సమయంలో తన భార్య రమాదేవితో బైక్‌పై సూర్యాపేటకు వస్తున్నాడు. ఇదే అదునుగా భావించిన వెంకన్న బండమీది చందుపట్ల గ్రామం సమీపంలోకి రాగానే మూత్ర విసర్జన కోసం బైక్‌ను ఆపాడు. వెంటనే వెంకన్న అతడి భార్య రమాదేవిని పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఆమె తలను బలంగా మోదాడు. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. అంతేకాకుండా ఇతరులకు అనుమానం రాకుండా బైక్‌ను కిందపడేసి కొంతమేర ఈడ్చుకెళ్లాడు. దీంతో పాటు వెంకన్న కూడా కాళ్లు, చేతులకు కొన్ని దెబ్బలు తగిలించుకున్నాడు. అనంతరం భార్య రమాదేవిని ఆసుపత్రికి తరలించగా అక్కడ కొన్ని రోజుల పాటు చికిత్స పొంది మృతి చెందింది. ఈ విషయమై చివ్వెంల పోలీస్‌స్టేషన్‌లో రోడ్డు ప్రమాదం కేసు నమోదైంది. తర్వాత వెంకన్న అక్రమ సంబంధం ఏర్పర్చుకున్న నస్రీన్‌తో తన భార్యను చంపానని, నీభర్త రఫీని కూడా చంపితే తమకు ఎవరు అడ్డు ఉండరని చెప్పాడు. అందుకు ఆమె ఒప్పుకోవడంతో వెంకన్న రఫీని చంపడానికి తన స్నేహితులైన శ్రీశైలం, మధు సహకారం కోరాడు. దీంతో ఈనెల 9న రఫీ రాత్రి సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన విషయాన్ని నస్రీన్ వెంకన్నకు తెలిపింది. ఇదే అదునుగా భావించిన వెంకన్న, తన స్నేహితులతో నస్రీన్ ఇంటికి ముందుగా చేరుకున్నారు. రఫీ రాత్రి 11గంటల సమయంలో పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. ఇదే అదునుగా భావించి అతడిని గట్టిగా పట్టుకొని కిందపడేసి గొంతునులిమి హత్య చేశారు. అనంతరం చీరతో రఫీ గొంతుకు బిగించి ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు కట్టి వెళ్లారు. ఉదయాన్నే నస్రీన్ తనకు ఏమి తెలియనట్లు తన భర్త రఫీ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు, పోలీసులకు సమాచారం అందించింది. దీంతో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి రఫీ శరీరంపై గాయాలు ఉండటం, నస్రీన్ ప్రవర్తన అనుమానంగా ఉండడంతో కేసు మరింత లోతుగా విచారించారు. దీంతో అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్పీ తెలిపారు. హత్య కేసులను చేధించిన సూర్యాపేట పట్టణ పోలీసులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ మేక నాగేశ్వర్‌రావు, డీఎస్పీ నాగభూషణం, పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్‌ఐ యాకూబ్, సిబ్బంది గొర్ల కృష్ణయ్య, గోదేవీ కర్ణాకర్, సైదులు తదితరులు ఉన్నారు.